teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 160| చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 7 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించే దిశగా గ్లోబల్ సమ్మిట్

జరగనున్న 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు 02






## నల్గొండ గడ్డ కాంగ్రెస్ అడ్డా

డబుల్ బెడ్ రూమ్ vs ఇందిరమ్మ ఇళ్లు
గ్రామాల్లో తేల్చుకుందాం - బీఆర్ఎస్‌కు సవాల్
దేవరకొండ సభలో సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ 02



## గుమ్మడి నర్సయ్య బయోపిక్

శివరాజ్ కుమార్ నటన గొప్ప విషయం : కవిత
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలి ప్రశంసలు 02



# ఓఆర్ఆర్‌పై ఏఐ కెమెరాల నిఘా

### అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు అడ్డుకట్ట

- 14 ప్రాంతాల్లో ఏర్పాటుకు సైబరాబాద్ పోలీసుల నిర్ణయం
- 24 గంటల పాటు పర్యవేక్షణ లక్ష్యం
- టెక్నాలజీతో నిబంధనల అతిక్రమణకు ఈ-చలాన్లు






02

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై అతివేగం, రాంగ్ సైడ్ పార్కింగ్, లేన్ డ్రైవింగ్ అతిక్రమణ, డ్రైవర్ల నిర్లక్ష్యం వంటి కారణంగా ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వీటి నివారణకు సైబరాబాద్ పోలీసులు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీసీ)లు సంయుక్తంగా కార్యాచరణకు దిగాయి.

## రాష్ట్రాల ఉచిత పథకాలపై కేంద్ర ఆర్థిక మంత్రి ఆందోళన

### అప్పుల భారం భరించే సామర్థ్యం రాష్ట్రాల బడ్జెట్‌కు లేదు

### రుణాలను భర్తీ చేయాల్సిన పరిస్థితి రావచ్చు



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాల సంస్కృతి వేగంగా పెరుగుతుండటం పట్ల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ సమస్య ఉచిత పథకాల గురించి కాదని వాటిని భరించే సామర్థ్యం రాష్ట్రాల బడ్జెట్‌కు లేకపోడవమే అసలు సమస్య అన్నారు. శనివారం హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్


మిగతా 2 లో

## రామగుండం థర్మల్ స్టేషన్ మూసివేత

- 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌కు ముగింపు
- 1971లో స్థాపించిన తొలి థర్మల్ స్టేషన్‌గా చరిత్ర
- 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి రికార్డు




.. వివరాలు 2లో




## ప్రశ్నించిన బాధితులపైనే అక్రమ కేసు...!

### కోర్టులో "నడుస్తున్న కేసుకు" హాజరవుతున్న బాధితులు

- బట్టబయలు కానున్న కార్యదర్శి చీకటి కోణం
- మూడేళ్ళ తర్వాత అందుబాటులోకి ఆధారాలు
- మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురైన సదరు వ్యక్తులు
- ములుగు జిల్లాలో వెలుగులోకి రానున్న విషాద ఘటన
- త్వరలో కీలక మలుపు
- మరుసటి సంచికలో... పూర్తి ఆధారాలతో..
- తీన్మార్ దినపత్రిక ప్రత్యేక కథనం








.. వివరాలు 2లో

## కేంద్ర చట్టాలపై తిరగబడతాం

### కార్మిక చట్టాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

### లోక్‌సభ పోరాటంపై కేటీఆర్ ప్రకటన



హైదరాబాద్, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్) తెలంగాణ భవన్ వేదికగా కార్మిక సంఘాలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో

మిగతా 2 లో

## హోంగార్డుల రైజింగ్‌డే

కాంగ్రెస్‌పై హరీష్‌రావు ధ్వజం
హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ 02






## గ్లోబల్ సమ్మిట్‌లో ఇందిరా మహిళా శక్తి స్టాల్


### మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం నిబద్ధతకు ప్రతీక

హైదరాబాద్, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): భారత్ ఫ్యూచర్ సిటిలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047లో మహిళా సాధికారతకు ప్రతీకగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న విధానాలకు ఈ స్టాల్ అద్దం పడుతోంది. మహిళా స్వయం సహాయక సంఘాల శక్తి, సాధికారత, వ్యాపార నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల

మిగతా 2 లో

## విమాన టికెట్ ధరల పెంపుపై కేంద్రం సీరియస్


- ఇతర ఎయిర్‌లైన్స్‌కు హెచ్చరికలు
- ధరల నియంత్రణకు విమానయానశాఖ ఆదేశం
- టికెట్ల రీఫండ్ పూర్తి చేయాలని ఇండిగోకు డెడ్‌లైన్ 07



## విమానాల రద్దుతో రైల్వే శాఖ కీలక నిర్ణయం




- 37 ప్రీమియం రైళ్లకు 116 అదనపు కోచ్‌లు
- డిసెంబర్ 10 వరకు అందుబాటులో సేవలు
- ప్రధాన నగరాల ప్రయాణికులకు ఉపశమనం




## రెండు రాష్ట్రాల్లో పవన్ కామెంట్ల రాజకీయ రచ్చ

కోనసీమ వ్యాఖ్యలపై దుమారం
ఎక్స్‌లో #TelanganaLoves-Pawankalyan ట్రెండింగ్
దిష్టి వ్యాఖ్యలకు స్పందనగా ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్

.. వివరాలు 2లో

# ఓఆర్ఆర్‌పై “ఏఐ” కెమెరాల నిఘా

హైదరాబాద్, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై అతివేగం, రాంగ్ సైడ్ పార్కింగ్, లేన్ డ్రైవింగ్ అతిక్రమణ, డ్రైవర్ల నిర్లక్ష్యం వంటి కారణంగా ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వీటి నివారణకు సైబరాబాద్ పోలీసులు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీసీ)లు సంయుక్తంగా కార్యాచరణకు దిగాయి. 24 గంటల పాటు ఔటర్‌పై నిఘా ఉంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఓఆర్ఆర్ పొడవు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీసులు 14 ప్రాంతాల్లో ఏఐ ఆధారిత మల్టీ వయలేషన్ డిటెక్షన్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులోని ఎలక్ట్రానిక్ మానిటరింగ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఈఎస్) సాంకేతికత ద్వారా ప్రమాదాలకు కారణం, కారకులను గుర్తించడానికి వీలు కలుగుతుందని పోలీసులు భావిస్తున్నారు.



**లేన్ డ్రైవింగ్.**

నగరం చుట్టూ 158 కి.మీ మేరకు ఓఆర్ఆర్ విస్తరించి ఉంది. ఈ రోడ్డుకు 25 ఎగ్జిట్ పాయింట్లున్నాయి. ఔటర్‌పై ఒక్కో లైన్‌లో ఒక్కో వేగంతో వెళ్లడానికి అవకాశం ఉన్నా డ్రైవర్లు ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేయడం, అనుమతి లేని ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి రకరకాల కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళలో జరిగే ప్రమాదాలకు కారణాలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారడంతో ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో వాహనాల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? అనేది స్పష్టంగా తెలుసుకునే వీలుంటుంది. అలాగే ఔటర్‌పై స్లో, స్పీడ్ మూమెంట్ వాహనాలను సులువుగా గుర్తించవచ్చు.

**పెట్రోలింగ్ టీమ్‌కు మెసేజ్.**

ఏఐ కెమెరాల్లోని సాంకేతికతతో ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్, మోడల్, క్లాసిఫికేషన్‌ను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించి ఈ- చలానాలు వేసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే సాంకేతికత ద్వారా ఏ ప్రాంతంలోనైనా అనధికారంగా వాహనాలను పార్కింగ్ చేసి ఉన్నా వెంటనే స్థానిక పెట్రోలింగ్ టీమ్‌కు మెసేజ్‌ను పంపిస్తుంది. వాహనాల కదలికలను గుర్తించి, ప్రమాదాలు జరిగితే అంబులెన్స్‌లను అలర్ట్ చేసే టెక్నాలజీ కూడా ఏఐ కెమెరాలకు ఉంటుంది.

# హోంగార్డుల రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోంగార్డులందరికీ రైజింగ్‌డే శుభాకాంక్షలు తెలిపారు మజీ మంత్రి హరీష్‌రావు. ప్రజాభద్రత, విపత్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణలో మీరు అందిస్తున్న సేవలు అమూల్యమని కొనియాడారు. హోంగార్డుల సేవలను గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ. 9000 గా ఉన్న వేతనాన్ని, రూ. 27,600 కు పెంచిందన్నారు. ట్రాఫిక్ లో విధులు నిర్వహించే వారికి 30% రిస్క్ అలవెన్స్ ఇచ్చింది. మహిళా హోంగార్డులకు ప్రసూతి సెలవులు ఇచ్చి ఆత్మ గౌరవం పెంచిందని తెలిపారు. కేసీఆర్ ప్రగతి భవన్ వేదికగా హోంగార్డులతో సమావేశమై వేతనాల పెంపుతో పాటు వారి అనేక అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ.5లక్షల బీమా అందజేస్తూ, కార్యక్రమాల నిర్వహణకు ఇచ్చే 5 వేల రూపాయలను రూ.10 వేలకు పెంచారు. మొత్తంగా బీఆర్ఎస్ ప్రభుత్వం హోంగార్డుల వేతనాలు, ఇతర భత్యాలకు ఏడాదికి సుమారు రూ.600 కోట్లకుపైగా ఖర్చు చేయడంతో వారి కుటుంబాలు గౌరవంగా బతికాయి. కాంగ్రెస్ సర్కార్ కేవలం బీఆర్ఎస్ ఇచ్చిన రోజువారీ వేతనం రూ.921కి మరో 79 కలిపి మొత్తం రూ.వెయ్యి చేసి ఎంతో చేసినట్టుగా గప్పాలు కొట్టడం నయ వంచనే అవుతుంది. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి అవి అమలు చేయకపోగా, తన వికృత చేష్టలతో హోంగార్డులను తీవ్రంగా అవమానిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మందికి పైగా ఉన్న హోంగార్డులతో ఎన్నో పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం, పోలీసుశాఖ వారి సంక్షేమాన్ని మాత్రం గాలికొదిలింది. వారి బతుకులను రోడ్డు పాలు చేసింది. హోంగార్డ్ ల సమస్య లు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అని మాజీ మంత్రి హరీష్‌రావు సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# గ్లోబల్ సమ్మిట్‌లో “ఇందిరా మహిళా శక్తి” స్టాల్

మొదటి పేజీ తరువాయి

ముందు సమగ్రంగా ప్రదర్శించే వేదికగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (సెర్ప్), తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాల నమూనాలు ప్రదర్శిస్తున్నారు. మహిళలే నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి పెట్రోలు బంకు, హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్, జిల్లాల వ్యాప్తంగా నిర్మితమైన ఇందిరా మహిళా శక్తి భవనాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, అలాగే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ వంటి విభిన్న వ్యాపారాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు ఈ స్టాల్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామీణ స్థాయి నుంచి గ్లోబల్ వేదిక వరకు మహిళల ప్రయాణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన డాక్యుమెంటరీలను ప్రదర్శన కోసం ప్రత్యేక స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలు ఎలా వ్యాపారవేత్తలుగా ఎదిగాయి, ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి ఎలా సుస్థిర ఆదాయ మార్గాలుగా మారింది అనే అంశాలు ఈ డాక్యుమెంటరీల ద్వారా సందర్శకులు తెలుసుకోగలగుతారు. అలాగే మహిళా, శిశు సంక్షేమం కోసం ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన నూతన కార్యక్రమాల వివరాలను కూడా స్టాల్‌లో సమగ్రంగా ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్, మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి అన్న ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలిచి, దేశం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది.

# నల్గొండ గడ్డ కాంగ్రెస్ అడ్డా

నల్గొండ, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. దేవరకొండ గడ్డ కాంగ్రెస్ అడ్డ అని చెప్పారు. నిజాం రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్లగొండ ప్రాంతం అని అన్నారు. నల్లగొండ గాలికి, నీటికి పోరాట పటిమ ఉందని తెలిపారు. ఓటు అనే ఆయుధంతో గడీలను బద్దలు కొట్టారని కొనియాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముందుకు వెళుతున్నామని అన్నారు. కొత్త రేషన్ కార్డులతో పేదలు ఆత్మగౌరవంతో బతికేలా చేశామని తెలిపారు. తెలంగాణలో తప్ప దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా పేదలకు రేషన్ దుకాణం ద్వారా సన్నబియ్యం ఇవ్వడం లేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ సొంత రాష్ట్రమైనా గుజరాత్‌లో కూడా సన్నబియ్యం ఇవ్వడం లేదని గుర్తుచేశారు. దేవరకొండ నుంచి మీద నుంచి బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మీరిచ్చారో ఇందిరమ్మ ఇండ్లు మేమిచ్చామో గ్రామాల్లోకి వెళ్లి తేల్చుకుందామని సవాల్ చేశారు. పదేళ్లు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారని మండిపడ్డారు. అందుకే అంతా ఏకతాటిమీదకు వచ్చి తెలంగాణ ప్రజలను పట్టిపీడించిన నాయకులను ఓడించామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరిగింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, 60 వేలకు పైగా ఉద్యోగాలు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలు, రేషన్ కార్డులు ఇలా చెప్పుకుంటూ పోతే రెండేళ్లలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదల



ఇళ్లలో వెలుగులు నిండాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.22 వేల 500 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. ఎస్టీల రిజర్వేషన్లపై కొందరు కుట్రలు చేస్తున్నారు. ఆదివాసీ, లంబాడీల మధ్య గొడవ పెట్టారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నిన్న కేసీఆర్ ఇద్దరు సర్పంచులు, ముగ్గురు వార్డు మెంబర్లతో సమావేశం అయ్యి మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని అంటుండు కేటీఆర్, హరీష్ రావు ఉన్నన్ని రోజులు బీఆర్ఎస్‌కు మంచి రోజులు రావని అన్నారు. కేసీఆర్ కొంప ముంచేది ఆ ఇద్దరే అని హాట్ కామెంట్స్ చేశారు. ఒకప్పుడు కేసీఆర్ ఎంతో ఘనంగా బతికారు ఇప్పుడు కేటీఆర్, హరీష్ రావు ఇద్దరూ కలిసి కేసీఆర్‌ను రోడ్డు మీదకు లాగారు. పదేళ్ల పాలన సమయంలో కేబినెట్ మంత్రులను కూడా గడీ గేట్ దగ్గర నుంచే వెనక్కి పంపారని గుర్తుచేశారు.

# గుమ్మడి నర్సయ్య బయోపిక్

హైదరాబాద్, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత గుమ్మడి నర్సయ్య సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమాన్ని వదిలి ఈ కార్యక్రమానికి వచ్చానని చెప్పారు. అందరికీ ఆదర్శవంతం అయిన గుమ్మడి నర్సయ్య జీవితాన్ని సినిమాగా తెరకెక్కించడం చాలా ఆనందంగా ఉందన్నారు. డైరెక్టర్ కామేశ్వర్ కామారెడ్డి బిడ్డ ఈ సినిమా తీస్తున్నాడని అన్నారు. గుమ్మడి నర్సయ్య తెలంగాణ వ్యక్తి కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ సినిమాను సురేష్ రెడ్డి ఐదు భాషల్లో నిర్మించడం గొప్ప విషయం అన్నారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ ఈ సినిమా చేసేందుకు ముందుకు రావడంతో సినిమాకు ఎంతో పేరు వచ్చిందన్నారు. గుమ్మడి నర్సయ్య అంటే తమకు ఎంతో గౌరవం అని అలాంటి వ్యక్తి బయోపిక్ లో నటించడానికి శివరాజ్ కుమార్ ముందుకు రావడం పాత్రకు వన్నె తెచ్చిందన్నారు. ఈ సినిమా ద్వారా ఖమ్మం మరోసారి చరిత్ర సృష్టించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఇలాంటి సినిమాలు వస్తే యువత క్లీన్ పాలిటిక్స్ వైపు అడుగువేసే అవకాశం ఉందన్నారు.





# ప్రశ్నించిన బాధితులపైనే అక్రమ కేసు..!

ములుగు, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్ ప్రత్యేకం): ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన లోన్ల విషయంలో ములుగు జిల్లాలోని ఓ గ్రామ కార్యదర్శి అక్రమాలకు, అన్యాయానికి పాల్పడుతున్నారంటూ అక్కడి దరఖాస్తుదారులు కొందరు ధైర్యంగా నిలదీశారు. తమకు రావాల్సిన లబ్ధిని అడ్డుకోవడమే కాకుండా, మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయని గట్టిగా ప్రశ్నించారు. అయితే, దీనిని జీర్ణించుకోలేని సదరు గ్రామ కార్యదర్శి... అహంకార ధోరణిలో అన్యాయాన్ని ప్రశ్నించిన దరఖాస్తుదారులపైనే ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టించారనేది గట్టి వాదన. ఈ కారణంగా ఇంతకాలం దోషులుగా కోర్టుకు హాజరైన దరఖాస్తుదారులు, ఇప్పుడు ఈ కొత్త ఆధారాలతో సాక్షులుగా మారి.. ఆ కార్యదర్శి చీకటి కోణాన్ని బయటపెట్టనున్నారు. న్యాయవ్యవస్థలో ఎప్పుడూ న్యాయమే గెలుస్తుందని మరోసారి రుజువు చేస్తూ.. త్వరలోనే ఈ కేసులో కీలక మలుపు సంభవించనుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి అధికార దుర్వినియోగం, దరఖాస్తుదారులపై పెట్టిన అక్రమ కేసుకు సంబందించిన పూర్తి వివరాలు, సంబంధించిన పత్రాలు... మరుసటి సంచికలో...

# రాష్ట్రాల ఉచిత పథకాలపై “కేంద్ర ఆర్థిక మంత్రి ఆందోళన”

మొదటి పేజీ తరువాయి



సమ్మిట్‌లో మాట్లాడిన ఆమె ఉచిత పథకాల కోసం రాష్ట్రాలు అప్పులు చేయడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోందన్నారు. అప్పు తీర్చేందుకు రాష్ట్రాలు మళ్లీ అప్పులు చేయడం సరైన చర్య కాదన్నారు. ఆ రుణాలను భర్తీ చేయాల్సి రావొచ్చు: పలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ అప్పుల పునర్వ్యవస్థీకరణ కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే రాష్ట్రాలకు నేరుగా నిధులు ఇవ్వకుండా నిపుణుల పరిజ్ఞానం ద్వారా సహకారం అందిస్తున్నామని ఆమె చెప్పారు. ఖర్చులు, ఆర్థిక వ్యవహారాల శాఖలకు చెందిన అధికారులు రాష్ట్ర ఆర్థిక శాఖలతో కలిసి అప్పుల నిర్మాణాన్ని పునః సమీక్షించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు ఇకపై తమ రుణాలను తీర్చే పరిస్థితి లేదని దీంతో రాష్ట్రాల పాత, ఖరీదైన రుణాలను వాటి జరిమానాలతో సహా భర్తీ చేయాల్సి రావచ్చని ఆమె పేర్కొన్నారు.

**జీఎస్టీ తర్వాత నెక్స్ట్ సంస్కరణ అదే:**

ఇటీవల జీఎస్టీ 2.0 సంస్కరణలు అమలు చేసిన నేపథ్యంలో కేంద్రం తదుపరి చేపట్టబోయే ఆర్థిక సంస్కరణలపై నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా హింట్ ఇచ్చారు. కస్టమ్స్ సుంకాల సరళీకరణ చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ విధానాన్ని మరింత పారదర్శకంగా రూపొందించనున్నట్లు చెప్పారు. భారతదేశ కస్టమ్స్ ఫ్రేమ్‌వర్క్ యొక్క సమగ్ర మార్పు జరుగుతోందని, దీనిని ఆమె నెక్ట్ బిగ్ క్లీనప్ జాబ్ గా పేర్కొన్నారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలమేమీ కాదని ఇలాంటి పరిస్థితులు ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని వ్యాఖ్యానించారు.

# రామగుండం థర్మల్ స్టేషన్ మూసివేత



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): ఐదు దశాబ్దాలుగా తెలంగాణకు సేవలందించిన రామగుండం థర్మల్ స్టేషన్ మూసివేయబడింది. రాష్ట్రంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగుండం థర్మల్ స్టేషన్ ను అధికారులు మూసివేశారు. 1971 అక్టోబర్‌లో ఉసైడ్ సహకారంతో స్థాపించిన తొలి థర్మల్ స్టేషన్‌గా రామగుండం థర్మల్ స్టేషన్‌గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ ప్లాంట్ మొత్తం 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిన ఈ ప్లాంట్ జీవితకాలం ముగిసిందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరువు ప్రభావిత జిల్లాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ఈ యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. నాలుగు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా సేవలు అందించిన ఈ థర్మల్ స్టేషన్ తాజాగా మూతపడటంతో చారిత్రక ఘట్టంగా నిలిచింది.

# కేంద్ర చట్టాలపై తిరగబడతాం

మొదటి పేజీ తరువాయి

ప్రపంచంలోనే అత్యంత కుబేరులు ఉన్నారు, అలాగే అత్యంత పేదరికం ఉంది. ‘ప్రపంచమే కుగ్రామం’ అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారు. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాతాం అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో 92 శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. కేసీఆర్ పేదవారి సంక్షేమాన్ని ఎన్నడూ విస్మరించకుండా మానవీయ కోణంలో ఆలోచించారు. సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్లలో రూ. 3500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారు. కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారు. ప్రతిపక్షంలో ఉండగా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరపున ఆర్థిక సాయం చేశారని గుర్తుచేశారు. కనీసం పాలకుల్లో చలనం వస్తుందని కేసీఆర్ ఆనాడు పార్టీ తరఫున సాయం చేశారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పరంగా సాయం చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేది. ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకు రాబట్టే ఫలితాలు సాధించింది. అలాంటి వాటిపై ఈ దేశంలో చర్చ జరగదు. అన్నింటికీ మందు పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయి. మోనోపలీ (ఏకాధిపత్యం) వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందో, ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయి. కేంద్ర ప్రభుత్వం పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగింది. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదు. కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్‌పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లుగా మారాయి. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇండిగో వల్ల జరిగిన అసౌకర్యం మిగతా రంగాలకు విస్తరిస్తుంది. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఏ కార్మిక సంఘంతో కలిసి బీఆర్‌టీయూ పనిచేసినా అభ్యంతరం లేదు. ఇప్పుడు ఏ ఎన్నికలు లేవు, బీఆర్‌టీయూ ఎవరితోనైనా పని చేయొచ్చు. లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటే దేశానికి దిక్సూచి అవుతుంది. సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుంది? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదాం. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దాం. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తాం. వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని కేటీఆర్ కీలక ప్రకటన చేశారు.

## మీడియా సెంటర్ సందర్శించిన పరిశీలకులు మధుకర్ బాబు



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికలు 2025, సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నీ శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మధుకర్ బాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రతిరోజు ప్రసారమయ్యే, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలలో ఎన్నికలకు సంబంధించి వస్తున్న వార్త కథనాలను శ్రద్ధగా పరిశీలించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం గమనిస్తూ ఉండాలని డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ కు తెలియజేశారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది కాల్వ రాము, కృష్ణ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికలు – 2025, సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సూచనల ప్రకారం జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరిగే ఐదు మండలాలు మహబూబాబాద్, గూడూరు, కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి, మండల కేంద్రాలలో మండల స్థాయి ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, సంబంధిత ఎన్నికల విభాగం మాస్టర్ ట్రైనర్స్ చే (పి ఓ) ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. నెల్లికుదురు మండల కేంద్రంలో జరిగిన శిక్షణ తరగతులలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మధుకర్ బాబు కూచిపూడి, హాజరైన ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు సలహాలు జారీ చేశారు. గూడూరు మండల కేంద్రంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో, ఎమ్మార్వో, కేసముద్రం మండల ప్రత్యేక అధికారి మధుసుదన రాజు, మహబూబాబాద్ మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం, ఇనుగుర్తి మండల ప్రత్యేక అధికారిని కృష్ణవేణి, సంబంధిత అన్ని ఎన్నికల విభాగాల అధికారులతో కలిసి స్వయంగా శిక్షణ తరగతులలో పాల్గొనీ హాజరైన ఎన్నికల విభాగం సిబ్బందికి ఎన్నికల విధి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు పాటించవలసిన నియమ నిబంధనలపై క్లుప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాలను అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, పర్యవేక్షించారు శిక్షణకు హాజరైన, గైహాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## నవ్యశ్రీ గెలుపు ఖాయం

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సంగెం, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి రాయపురం నవ్యశ్రీ కార్తిక్ గ్రామప్రజల మద్దతుతో అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం హనుమకొండలో మాజీ ఎమ్మెల్యే నివాసంలో వారిని నవ్యశ్రీ మరియు పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటమి భయంతో,ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేకనే కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి బెదిరింపులకు భయపడే వారెవరు లేరని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లు



పరకాల, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): పరకాల పట్టణ కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత, దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుబడిన మహానేత, పోరాటమే జీవితంగా మార్చుకున్న త్యాగశీలి, భారతరత్న డా, బాబాసాహెబ్ భీం రావు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పరకాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో పరకాల మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గోవింద్ సురేష్, మాదారం పిఏసిఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, బొచ్చు జెమిని, మునిగంటి విష్ణువర్ధన్, పసుల శ్రీనివాస్, ఇంగిలి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కార్యక్రమాలపై డిఎం అండ్ హెచ్ఓ అధికారి సమీక్ష



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): శనివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ బి.రవి రాథోడ్ జిల్లాలో ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమగ్ర సమీక్షను, మండలాల ఆరోగ్య అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం 11.00 గంటలకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ మేడారం జాతర డ్యూటీలు, రాబోయే మేడారం జాతర కోసం వైద్య శిబిరాల ఏర్పాటుకు అవసరమైన మందులు, సిబ్బంది, అంబులెన్స్‌లు, తాగునీటి సౌకర్యాలు, సానిటేషన్ ఏర్పాట్లపై విభాగాధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల డ్యూటీలు ముందున్న ఎన్నికల కార్యక్రమాల్లో ఆరోగ్య సిబ్బంది విధులు, హెల్త్ సపోర్ట్ సర్వీసులు, మెడికల్ క్యాంప్స్ సంసిద్ధతపై మార్గదర్శకాలు ఇచ్చారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రదమ చికిత్స కేంద్రం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రిలో ని పాలియేటివ్ కేర్ సెంటర్, అసంక్రమిత వ్యాదుల నియంత్రణ క్లినిక్ ని సందర్శించారు. పాలియేటివ్ కేర్ సెంటర్ ద్వారా కేన్సర్, మూత్రపిండాల వ్యాధులు, నాడీవ్యవస్థ సమస్యలు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులకు నొప్పి నియంత్రణ, మానసిక సహాయం, కౌన్సెలింగ్ సేవలు అందించడం అత్యంత అవసరమని తెలిపారు. ఎన్సీడి క్లినిక్‌లో షుగర్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్ గుర్తింపు వంటి అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, చికిత్స, ఫాలో అప్ విధానాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఈ సేవలను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ రోజు మద్యాహ్నం 2.00 గంటలకు ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది తో ప్రత్యేక జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ లో ANC సందర్శనాల వివరాలను MCH పోర్టల్ మరియు HMIS పోర్టల్ లో సమయానికి పూర్తిగా నమోదు చేయడం.గర్భిణీ స్త్రీల ప్రారంభ నమోదు మరియు 1వ, 2వ ANCలను PHCలో, 4వ ANCను నిర్దేశిత సమాయంలో చేయించడం. హై రిస్క్ ప్రెగ్నెన్సీలను ముందుగానే గుర్తించి, తగిన రిఫరల్ మరియు నిర్వహణ చేయడం.ప్రథమ గర్భిణీ స్త్రీల (ప్రైమి గ్రావిడా) కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ సాధారణ ప్రసవాల పట్ల విశ్వాసం పెంపొందించడం. మిడ్వైఫరీ సేవలను బలోపేతం చేయడం, ప్రైవేట్ ఆసుపత్రులలో అధిక సిజేరియన్‌లపై నిరంతర ఆడిట్లు మరియు తనిఖీలు చేయాలని అన్నారు. కీటక జనిత వ్యాదుల నియంత్రణలో భాగంగా డెంగ్యు,మలేరియా, సిసనల్ వ్యాధులు అదుపులో ఉన్నాయని అన్నారు. అసంక్రిత వ్యాదుల నియంత్రణ, హైపర్టెన్షన్, షుగర్, హృద్రోగాలు, క్యాన్సర్, కిడ్నీ సంబంధిత సమస్యల కోసం ఏర్పాటు చేసిన NCD క్లినిక్స్ పనితీరును సమీక్షించారు.30 ఏళ్లు పైబడి ఉన్న ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా NCD స్క్రీనింగ్ చేయాలని PHC మెడికల్ ఆఫీసర్లు మరియు ANMలకు ఆదేశాలు జారీ చేశారు. ఒబేసిటీ, ధూమపానం, మద్యపానంపై ప్రజల్లో అవగాహన కల్పిన్చేందుకు IEC కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమం జిల్లా స్థాయిలో TB కేసుల నమోదు, ఫాలోఅప్, మరియు చికిత్స పూర్తిచేసే శాతం (Treatment Success Rate)ను పరిశీలించారు. TB రోగులకు Nikshay Poshan Yojana ప్రయోజనాలు సమయానుసారం అందజేయాలని ఆదేశించారు. క్షయనివారణ కోసం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, sputum collection మరియు CBNAAT పరీక్షలను పెంపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుదీర్ రెడ్డీ, డాక్టర్ లక్ష్మి నారాయణ,డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రవణ్ కుమార్, MCH నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష,హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం,శారదా, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ,,హెచ్.ఇ.ఒ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలన జరపాలి

### మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో కీలక సూచనలు

### సాధారణ పరిశీలకుడు ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



ములుగు జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని సాధారణ పరిశీలకుడు (ఎన్నికలు) ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్, హైదరాబాద్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాధారణ పరిశీలకుడు (ఎన్నికలు) ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్, హైదరాబాద్ విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగల్గుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్ కు ముందు రోజు ఉదయం 6.00 గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా ?లేదా ? అనేది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని, గమనించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా అన్నది గమనించాలని, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సరిగానే ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలని, టెండర్, ఛాలెంజ్ ఓటింగ్ లు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే పోలింగ్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించడం వరకే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత అని, ఎక్కడ కూడా పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకోకూడదని ఆయన హితవు పలికారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారు మినహా, ఇతరులెవరిని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. కరదీపిక లోని అంశాలను పూర్తి స్థాయిలో ఆకళింపు చేసుకుని తదనుగుణంగా విధులు నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జయ ప్రకాష్, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎన్నికల కోడ్ అమలు

### ఏకగ్రీవం జరిగిన గ్రామాల్లోనూ ఎన్నికల కోడ్ అమలు

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు (17.12.2025) జిల్లా అంతట ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ పోలింగ్ తో పాటు రెండవ దశ పోలింగ్ పూర్తయిన తరువాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందని, మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తొలగిపోతుందని తెలిపారు. అందువల్ల మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని తెలిపారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికలకు దూరమయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, చివరి దశ ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కోడ్ ను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఈనెల 11, 14, 17 తేదీల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, అలాగే ప్రజలు ఎంసీసీ నిబంధనలు పూర్తిగా పాటించి సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): పారదర్శక, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం గణపురం మండలంలోని రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులు, స్టేజి 2 అధికారులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహణలో ఏమైనా సందేహాలుంటే సిబ్బంది శిక్షణా తరగతుల్లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు నిర్వహణలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. 10 వ తేదీన పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు అదేరోజు చేరుకుని 11వ తేదీన పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఓటు హక్కు వినియోగం రహస్య పద్ధతిలో జరుగుతుందని, బయటికి కనిపించకుండా కంపార్ట్ మెంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 11వ తేదీన ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉంటుందని ముందుగానే అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ ప్రారంబానికి ముందు ముగిసిన తదుపరి ఏజెంట్లు సంతకాలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ వంటి గంట వరకు ముగుస్తుందని అప్పటికే ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగానికి వేచి ఉన్నట్టుయితే క్యూ లైన్ వెనుక నుండి ముందు వరకు సీరియల్ నంబర్ల స్లిప్పులు జారీ చేయాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తదుపరి 2 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభం కావాలని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డా కుమారస్వామి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్, మాస్టర్ ట్రైనర్లు ఎస్ శ్రీధర్, బి.రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం

**శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ సంపత్ రావు**



తాడ్వాయి, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. తొలి విడతగా ఎస్.ఎస్. తాడ్వాయి, ఏటూరు నాగారం మండలాలలో ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఆయా మండల కు కేటాయించిన ఆర్.ఓ.లు, ఏ ఆర్ ఓలు, పి.ఓ. లకు ఎస్.ఎస్. తాడ్వాయి, ఏటూరు నాగారం మండల కేంద్రా ల్లో వేరు వేరుగా శనివారం శిక్షణ తరగతులు నిర్వహిం చారు. ఈ సందర్భాల్లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలనను పకాగా పాటిస్తూ, అప్రమత్తతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికాబద్ధం గా వ్యవహరించాలని, పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తతో వ్యవహరిం చాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్.ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బంది అందరికీ నియమ, నిబంధ నల పట్ల పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అప్పుడే ఎక్కడ కూడా తప్పిదాలకు తావు లేకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయగల్గుతారని అన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉందా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొని సదుపాయాలను పరిశీలించుకోవా లని, ఓటింగ్ కంపార్ట్ మెంట్, సిటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. శిక్షణా తరగతులలో సూచించిన అంశాలను ఆకళింపు చేసుకుని, విధిగా పాటించాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉ న్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా సరిచూసుకోవా లని అన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని అంబర్. ఈ శిక్షణ తరగతుల్లో ఎం పి డి ఓ లు, ఎంపి ఓ లు, ఆర్.ఓ.లు, ఏ ఆర్ ఓలు, పి.ఓ.లు పాల్గొన్నారు.

# ఓటు అడిగే హక్కు ఒక కాంగ్రెస్ పార్టీకే ఉంది

**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి**

**శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**



పరకాల, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఆర్ ఆర్ గార్డెన్ నందు నిర్వహించిన పరకాల మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు మరియు పార్టీ ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సమావేశాన్ని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యమత్యంతో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు.పరకాల మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల జాబితాను తెలిపారు. పాత కొత్త తేడా లేకుండా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఓటు అడిగే హక్కు ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని, గత రెండు సంవత్సరాలుగా మనం చేసిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం కలిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దిశ నిర్దేశం చేశారు.

# ఎన్నికల నివేదికలు త్వరగా సమర్పించాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 6 (తీన్మార్ న్యూస్): ఎన్నికలకు సంబంధించిన నివేదికలు త్వరగా సమర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఎంపీడీవో, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఐనవోలు, పంథిని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్, వార్డు స్థానాల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలించారు. ఐనవోలు క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐనవోలు, పున్నేలు, ఒంటిమామిడిపల్లి, ఉడతగూడెం గ్రామాలు, పంథిని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంథిని, కక్కిరాలపల్లి, పెరుమాండ్ల గూడెం గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డు స్థానాలకు ఏకగ్రీమైన వివరాలను ఎంపీడీవో నర్మద, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ఎన్నికల ప్యాక్రియా జరగాలని అన్నారు. విత్ డ్రా అయ్యాయని, ఎన్ని ఏకగ్రీవమయ్యాయని, అభ్యర్థుల నుండి నామినేషన్ల ఉ పసంహరణ ఎలా తీసుకుంటున్నారని, ఫారం 9 ఎలా ప్రిపేర్ చేస్తారని, ఏమైనా ఏకగ్రీవాలు అవుతున్నాయా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నివేదికలు ఆలస్యం చేయకుండా త్వరగా పంపాలన్నారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నర్మదా, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీఓ రఘుపతి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 4వ బెటాలియన్లో హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవం



మామునూరు, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): నాలుగో బెటాలియన్ ఆవరణలో హోమ్ గార్డ్స్ 63వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బెటాలియన్ లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్స్ తో కేక్ కట్ చేయించి వారినకి శాలువా కప్పి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ హోమ్ గార్డ్స్ సంస్థ పోలీస్ డిపార్ట్మెంట్ కు కీలంకమైన సహాయక విభాగం హోంగార్డ్స్ చట్టం మరియు శాంతి ట్రాఫిక్ నియంత్రణ, విపత్తు స్పందన, పండుగలు, వీఐపీల భద్రత, నేర నివారణ, కమ్యూనిటీ సేవ వంటి రంగాల్లో ముఖ్యపాత్ర పోషిస్తుంది. దేశంలోనే అత్యధిక డైలీ డ్యూటీ అలవెన్స్ చెల్లిస్తుంది. హోంగార్డ్స్ కు పోలీస్ కానిస్టేబుల్ లతో సమానమైన యూనిఫామ్ అలవెన్స్ చెల్లిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం హోంగార్డ్స్ కి సోషల్ సెక్యూరిటీ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చింది. డైలీ డ్యూటీ అలవెన్స్ ను బ్యాంకుల ద్వారా చెల్లింపు, పోలీస్ ఆసుపత్రుల వైద్య సదుపాయాలు, హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయాలను, విధినిర్వహణలో మరణించిన హోంగార్డ్స్ కుటుంబానికి 30 లక్షల ఆర్థిక సహాయం వాటి సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం మరియు హోంగార్డు సంస్థ 2024 %డ% 2025 సంవత్సరాల్లో కల్పిస్తున్నారని తెలియజేశారు. అలాగే అర్హులైన హోంగార్డ్స్ కు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు, 3253 ఖాళీలకు కాంప్యాసినేట్ నియామకాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణ ప్రసాద్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్తీక్, రవి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, రాంప్రసాద్ అధికారులు హోం గార్డ్స్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



మొగుళ్లపల్లి, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ శుక్రవారం మొగుళ్లపల్లి మండలంలోని మొగుళ్లపల్లి, ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకపు యంత్రాల పని తీరు, తేమ శాతం కొలిచే పరికరాల పనితీరు, ధాన్యం రవాణా ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరగాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతుల నుండి నేరుగా ధాన్యం స్వీకరణ, చెల్లింపుల ప్రక్రియ వేగవంతం, రద్దీ నివారణ, కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తేమ శాతం కారణంగా కొనుగోలులో ఆలస్యం కాకుండా రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని అధికారులులకు సూచించారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా రైతులకు అనుకూలంగా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా సాగాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# వేపురిగేరిలో అయ్యప్ప స్వామి సామూహిక మహా పడిపూజ



మహబూబ్ నగర్, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ నగరంలోని వేపురిగేరిలో అయ్యప్ప మాలధారణ చేసిన భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి సామూహిక మహా పడిపూజ శనివారం భక్తి శ్రద్ధల నడుమ అత్యంత ఘనంగా జరిగింది. ప్రాంతమంతా 'స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో మార్మోగి ఆధ్యాత్మిక వాతావరణం అలుముకుంది. ఈ కార్యక్రమానికి గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఆయనకు శాలువాతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప స్వామి సేవలో ప్రజలు చూపుతున్న ఏకాగ్రత, నియమ నిష్ఠలు ప్రశంసనీయం అని అన్నారు. మహబూబ్ నగర్ లో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శ్రీనివాస్, నాగరాజు, హన్వేశ్ గురుస్వామి, యాదయ్య గురుస్వామి, ముత్యం గురుస్వామి, రాజు గురుస్వామి, తదితరులు పాల్గొన్నార

# మండలంలో కాంగ్రెస్ విజయ శంఖారావం

## దూసుకుపోతున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



బూర్గంపాడు, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని ముసలిమడుగు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పూణే సురేంద్ర, అలాగే అంజనాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బానోత్ నరసింహని ఘన విజయం దిశగా నడిపించేందుకు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు స్వయంగా ప్రజల్లోకి వెళ్లి శక్తివంతమైన ప్రచారాన్ని నడిపించారు. గ్రామాలు సందడితో కళకళలాడుతుండగ ప్రతి వీధి, ప్రతి వాకిలి కాంగ్రెస్ వాతావరణంతో మార్మోగింది.

**ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి**

కాంగ్రెస్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథాలు, రాబోయే ప్రణాళికలు ప్రజలకు స్పష్టంగా వివరించారు. అభ్యర్థులపై ఉన్న ప్రేమ, ఆదరణ ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం అని సంకేతాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. విజయం మా వంతే అభివృద్ధి మీ ఇంటి ముందు నిలుస్తుంది!" అనే శక్తివంతమైన నినాదంతో ప్రచారం దూసుకుపోతుంది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి,


పీఎస్ సిఎస్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పిటిసి బట్ట విజయ గాంధీ, కైపు లక్ష్మారెడ్డి, మొరంపల్లి బంజర సర్పంచ్ బొర్ర సుభద్ర, పినపాక పట్టి నగర్ సర్పంచ్ భనోత్ పద్మ, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి విశేషంగా శోభ చేకూర్చారు.

# ఆటో జేఏసీ సభను విజయవంతం చేయండి



నిజామాబాద్ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): ఈ నెల 9న వర్ని మం.లో జరుగు ఆటో జేఏసీ రాష్ట్ర సభను విజయవంతం చేయాలని నిజాంబాద్ జిల్లా అధ్యక్షుడు తగ్గేల్లి బాలరాజు అధ్యక్షతన కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉమార్ ఖానులు మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఆటో సంక్షేమ బోర్డు,12 వేల రూ.లు, మరియు ఆటోనగర్ లు ఏర్పాటు చేస్తామని తదితర హామీలు ఇచ్చిందని అట్టి హామీలను నమ్మి 30 లక్షలు ఓట్ బ్యాంకు కలిగిన ఆటో కుటుంబం అంతా కూడా గంపగుత్తగా కాంగ్రెస్కు ఓటు వేసి అధికారంలోకి తీసుకు వచ్చమని, ఇప్పటికీ రెండు సంవత్సరాలు గడిచినా కానీ ఆటో డ్రైవర్ల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని వారు ధ్వజమేత్తారు. స్థానిక ఎన్నికల ముందు ఆటో డ్రైవర్ల సత్తా చూపడానికే వర్ని సభను ఏర్పాటు చేశామని దానికంటే ముందె ఆటో డ్రైవర్లకు న్యాయం వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షారుఖాన్, పిరియా, మహమ్మద్, కృష్ణ, జావిద్, సాబీర్, మహేష్, హనుమ గౌడ్ పాల్గొన్నారు

# వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మణుగూరు, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్ట మల్లారం గ్రామం నందు పాయం సూరయ్య రాజమ్మ గర్ల తనయుడు పాయం రామకృష్ణ వెడ్స్ స్వరూపల వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని వధూవరులకు నూతన వస్త్రాలు బహుకరించి అక్షింతలు వేసి ఆశీర్వదించిన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. ఈ యొక్క కార్యక్రమంలో జీవ రత్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద

### పిఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో దిశా నిర్దేశం చేసిన కలెక్టర్




వరంగల్ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం పర్వతగిరి, రాయపర్తి మండల కేంద్రాల్లోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలల్లో వేర్వేరుగా పిఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల పోలింగ్ పక్కడ్బందీగా నిర్వహణకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడతలో గల మూడు మండలాలైన వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి లలో ఈనెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ కు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో అనేక దశల్లో అధికారులు పనిచేసిన క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర ప్రిసైడింగ్ అధికారులదేనని చెప్పారు. కేటాయించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ప్రిసైడింగ్ అధికారులు తప్పకుండా సమయానికి హాజరై సంబంధిత గ్రామపంచాయతీకి సంబంధించిన స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలన్నారు. వారికి కేటాయించిన ఎన్నికల సామాగ్రిని సక్రమంగా తనిఖీ చేసి బ్యాలెట్ పేపర్లలో తమ ప్రిసైడింగ్ స్టేషన్ కు సంబంధించిన వివరాలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు.

పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎన్నిక ధ్రువపత్రాల జారీ వంటి కార్యక్రమాలు అన్ని స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రిసైటింగ్ అధికారులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్ర పరిధిని గుర్తించడం, అభ్యర్థుల వివరాలను ప్రదర్శించడం, పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేయడం, పూర్తిగా ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతేనని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఎంపీడీవోలు కిషన్, శంకర్ నాయక్ తాహసిల్దారులు శ్రీనివాస్, వెంకట్ స్వామి పిఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల మార్గదర్శకాలు తప్పక పాటించాలి

### జిల్లా పరిశీలకులు బాల మాయాదేవి

### తొలి విడత పోలింగ్ సన్నద్ధతపై అధికారులకు శిక్షణ



వరంగల్ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు డిసెంబర్ 11న సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన (పీఓలు, ఏపీఓలు) ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కేంద్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి సందర్శించి, ఎన్నికల అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు మరియు మార్గదర్శకాలను అధికారులు తప్పకుండా పాటించాలని ఆమె సూచించారు. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ యొక్క నియమ నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకుని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని బాల మాయాదేవి అధికారులకు సూచించారు. శిక్షణ సందర్భంగా ఆమె పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మూడు విడతలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న జరగనుంది. ఈ పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. మొదటి విడతలో గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. పోటీలో ఉన్న అభ్యర్థుల కోసం ఎన్నికల సంఘం రోజువారీ వినియోగ వస్తువులకు సంబంధించిన ప్రత్యేక గుర్తులను కేటాయించింది. ఈ సందర్శనలో వరంగల్ ఆర్డీవో సుమ, జిఎం ఇండస్ట్రియల్ అధికారి నర్సింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎన్నికలు జరగాలి

### ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



జనగామ, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతి సర్పంచ్, వార్డు సభ్యుల సాధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిస్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మైక్రో అబ్జర్వర్ల కు సూచించారు. శనివారం జిల్లా %×ణూజ% కార్యాలయంలో మైక్రో అబ్సర్వర్ లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్బంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పలు సూచనలను తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, నైతికంగా వ్యవహరిస్తూ..ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు తమ చెక్‌లిస్ట్‌లో ప్రతి అంశంపై "అవును/కాదు" గా నమోదు చేసి, గమనించిన లోపాలు లేదా సంఘటనలను ప్రత్యేక రిపోర్ట్‌లో పొందుపరచాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో బ్యాలట్ బాక్స్‌ను సరైన విధంగా ఫిక్స్ చేయాలనీ.. ఎంట్రీ పాస్ సిస్టమ్‌ను కచ్చితంగా అమలు చేయలన్నారు. ఓటరు గుర్తింపు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేయాలన్నారు. ఇండెలిబుల్ ఇంక్ సరైన విధంగా అప్లై చేయడం, బ్యాలెట్ పేపర్ కౌంటర్ ఫాయిల్‌లో ఓటర్ వివరాలు నమోదు పోలింగ్‌లో రహస్యత్వం పూర్తి స్థాయిలో నిర్ధారించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల ప్రవర్తన, వారి ఫిర్యాదులపై తక్షణ చర్య, గ్రామపంచాయతీ కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలించడం, కౌంటింగ్‌కు సంబంధించిన ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం, ఫలితాల ప్రకటన, ఎన్నిక సర్టిఫికేట్ జారీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.

# పున్నేలు క్రాస్ వద్ద ఉన్న ఎస్ ఎస్ టి చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన కలెక్టర్



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): పున్నేలు క్రాస్ వద్ద ఉన్న స్టాటిక్ సర్వైలెన్స్ టీం (ఎస్ ఎస్ టి) చెక్పోస్ట్ ను శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు, ఎంసీసీ అమలు, వాహనాల పర్యవేక్షణ, అనుమానాస్పద రవాణా నివారణపై అధికారులు సక్రమంగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారో లేదో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఎస్ ఎస్ టి చెక్పోస్ట్ కు సంబంధించిన రికార్డును పరిశీలించారు. ఎంతమంది సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రతిరోజు వాహన తనిఖీలు చేపడుతున్నారా అని కలెక్టర్ అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, నియమావళి ప్రకారం ప్రతి వాహనాన్ని నిఖార్సుగా తనిఖీ చేసి ఎలాంటి అనుమానాస్పద రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# ఇండిగో విమానాల రద్దుతో “రంగంలోకి ఆర్టీసీ సేవలు”

### ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ ఊరట

### చెన్నై, బెంగళూరు రూట్లలో ప్రత్యేక సర్వీసులు




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానాల రద్దు నాలుగో రోజుకూ కొనసాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విమాన రద్దుల కారణంగా ఎయిర్‌పోర్టులో ఏర్పడ్డ గందరగోళాన్ని తగ్గించేందుకు తెలంగాణ ఆర్టీసీ రంగంలోకి దిగింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వివిధ నగరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చేందుకు స్లీపర్ కోచ్‌లను సిద్ధం చేసింది. శనివారం మధ్యాహ్నం నుంచి చెన్నై, బెంగళూరు రూట్లకు ప్రత్యేక బస్సులు బయల్దేరనున్నాయి.

**ఏపీకి అదనపు సర్వీసులు.**

చెన్నై, బెంగళూరుతో పాటు రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం కూడా అదనపు బస్సులను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చినట్లు సమాచారం. ఎయిర్‌పోర్టులో బస్సుల సమాచారం కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి, టికెట్ల లభ్యతపై స్పష్టమైన వివరాలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండిగో విమానాల రద్దు కొనసాగుతున్న సందర్భంలో టీజీఎస్ఆర్టీసీ చేపట్టిన ఈ చర్య ప్రయాణికులకు భారీ ఊరట కలిగిస్తోంది.

# ఆహ్వానానికి కృతజ్ఞతలు, హాజరు కాలేను

### రేవంత్ రెడ్డికి మమతా బెనర్జీ లేఖ

### కార్యక్రమం విజయవంతం కావాలని సీఎంకు శుభాకాంక్షలు



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డికి శనివారం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పంపారు. ఈ సమ్మిట్ డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనుందని తెలిపారు. అయితే, ఈ ఆహ్వానానికి ప్రతిస్పందిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ లేఖ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ జరిగే సమయంలో అదే తేదీల్లో తాను జిల్లాల పర్యటన ఉ ందని, ముందుగానే నిర్ణయించబడ్డ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండడంతో సమ్మిట్‌కు హాజరు కావడం సాధ్యం కాదని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఈ సమ్మిట్ తెలంగాణ రాష్ట్రానికి విలువైన ఫలితాలను అందిస్తుందని, నిర్మాణాత్మక చర్చలకు వేదిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆమె సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

# సిరీస్ పట్టేసిన టీమిండియా..!

## శతక్కొట్టిన జైస్వాల్.. సఫారీలను చిత్తుగా ఓడించి ప్రతీకారం




టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించి 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. వైజాగ్ గడ్డపై ఓపెనర్ యశస్వీ జైస్వాల్(116 నాటౌట్) అజేయ శతకంతో కదంతొక్కగా.. రోహిత్ శర్మ(75), విరాట్ కోహ్లీ(65 నాటౌట్) మరో క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ప్రత్యర్థి నిర్దేశించిన 271 పరుగుల ఛేదనలో టాపార్డర్ దంచేయడంతో టీమిండియా 9 వికెట్లతో సఫారీలను మట్టికరిపించింది.

ఛాంపియన్స్ ట్రోఫీ విజేత టీమిండియా స్వదేశంలో తొలి వన్డే సిరీస్ పట్టేసింది. టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ అయిన భారత జట్టు వన్డే సిరీస్‌లో తడాఖా చూపించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే వైజాగ్ వన్డేలో అత్యుత్తమ ఆటతో సఫారీలకు చెక్ పెట్టింది రాహుల్ సేన. ఈ ఫార్మాట్లో శతకంతో మెరిసిన యశస్వీ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా ఎంపికవ్వగా.. రెండు సెంచరీలు, ఒక ఫిఫ్టీ బాదిన కోహ్లీ ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’ అవార్డు అందుకున్నాడు.

రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ తర్వాత తొలిసారి టాస్ గెలిచిన భారత్.. బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని 270కే కట్టడి చేసింది. అనంతరం ఛేదనలో ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(116 నాటౌట్), రోహిత్ శర్మ(75) పవర్ ప్లేలో వికెట్ పడకుండా ఆడారు. యశస్వీ కాస్త ఆచితూచి ఆడగా.. రోహిత్ తనదైన ఫుల్‌షాట్లతో రెచ్చిపోయాడు. ఈ ద్వయం.. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో టీమిండియాను గెలుపు దిశగా నడిపింది. అయితే.. 61వ హాఫ్ సెంచరీ తర్వాత శతకానికి చేరువైన హిట్‌మ్యాన్‌ను మహరాజ్ వెనక్కి పంపాడు. దాంతో.. తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ 155 పరుగులకు తెరపడింది.

**కోహ్లీ విధ్వంసం..**

పవర్ ప్లే తర్వాత దంచేసిన రోహిత్ ఔటయ్యేసరికి భారత్ స్కోర్.. 155. అప్పటికి మ్యాచ్ టీమిండియా చేతుల్లోనే ఉంది. అనంతరం క్రీజులోకి వచ్చిన శతకాల వీరుడు విరాట్ కోహ్లీ(65 నాటౌట్) తనదైన స్టయిల్లో చెలరేగాడు. యాన్సెన్ ఓవర్లో బౌండరీతో తన విధ్వంసానికి తెరతీసిన విరాట్.. బాష్‌కు చుక్కలు చూపిస్తూ 34 ఓవర్లో 4, 6 బాదాడు. కాసేపటికే సింగిల్‌తో యశస్వీ వన్డేల్లో తొలి సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత గేర్ మార్చిన కోహ్లీ ఫోర్లతో హోరెత్తించాడు. పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన బార్ట్‌మన్‌ను టార్గెట్ చేసిన రన్ మెషీన్ అతడి ఓవర్లో బౌండరీతో 76వ అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచిన అతడు.. ఎంగిడి వేసిన 40 వ ఓవర్లో మూడు ఫోర్లతో మ్యాచ్‌ను ముగించాడు. విరాట్, యశస్వీ అజేయంగా నిలవగా 9 వికెట్లతో సఫారీలను ఓడించిన టీమిండియా.. 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



**ప్రసిధ్, కుల్దీప్ షో**

రాయ్‌పూర్ వన్డేలో తేలిపోయిన భారత బౌలర్లు వైజాగ్‌లో చెలరేగారు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా హిట్టర్ల జోరుకు కళ్లెం వేశారు. ప్రసిధ్ కృష్ణ(4-66) టాపార్డర్‌ను దెబ్బకొట్టగా.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(4-41) మిడిలార్డర్‌ను పడగొట్టి సఫారీలకు షాకిచ్చాడు. ఒకే ఓవర్లో డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(29), మార్కో యాన్సెన్(17)లను ఔట్ చేసి భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు కుల్దీప్. ఓపెనర్ క్వింటన్ డికాక్(106) సెంచరీతో కదంతొక్కగా.. కెప్టెన్ తెంబా బవుమా(48) రాణించగా ప్రొటీస్ టీమ్ 270కి ఆలౌటయ్యింది.

## విమాన టికెట్ ధరల పెంపుపై “కేంద్రం సీరియస్”




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా వరుసగా ఐదో రోజూ ఇండిగో ఎయిర్ లైన్స్ విమాన సేవలకు అంతరాయం కొనసాగుతోంది. విమానాలు రద్దు కావడంతో అనేక మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు ఈ పరిస్థితిని మిగతా ఎయిర్ లైన్స్ క్యాష్ గా మలుచుకుంటున్నాయి. ఇండిగో సంక్షోభంతో మిగతా ఎయిర్ లైన్స్ తమ టికెట్ ధరలను అమాంతం పెంచేశాయి. సాధారణ టికెట్ ధరల కంటే రెట్టింపు చార్జీల మోత మోగుతున్నాయి. ఈ పరిస్థితిని పలువురు ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. విమాన టికెట్ ధరల పెంపుపై విమానయానశాఖ జోక్యం చేసుకుంది. ఇండిగో సర్వీసులు రద్దయిన రూట్లలో విమాన ప్రయాణ చార్జీలు క్రమబద్ధీకరించింది. కొత్తగా నిర్ణయించిన చార్జీలను తప్పనిసరిగా పాటించాలని ఈ మేరకు అన్ని విమాన సంస్థలకు విమానయానశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి సమయంలో అవకాశవాదమా అంటూ మండిపడిన కేంద్రం. ఈ సంక్షోభాన్ని క్యాష్ చేసుకోవద్దని ఎయిర్ లైన్స్ కు హెచ్చరించింది. అడ్డగోలుగా రేట్లు పెంచితే ఊరుకోమని వార్నింగ్ ఇచ్చింది. పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ ఆదేశాలు పాటించాలని కేంద్రం స్పష్టం చేసింది.

**ఈరోజు రాత్రి 8 గంటల లోపు రీఫండ్ చేయండి:**

ఇండిగో తీరుపై కేంద్రం సీరియస్ అయింది. ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని ఇండిగోకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. టికెట్ల రద్దు రీఫండ్ ను ఆలస్యం చేయొద్దని ఈరోజు రాత్రి 8 గంటల లోపు ప్రయాణికులకు మొత్తం చెల్లించాలని ఆదేశించింది. ప్రయాణికుల సహాయార్థం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కాగా ఇండిగో విమానాల రద్దుతో పలు రూట్లలో దాదాపు 10 రెట్లు విమాన చార్జీలు పెరిగాయి. ముఖ్యంగా ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, గోవా, పూణే, శ్రీనగర్ టికెట్లు భారీగా పెరిగాయి.

## విమానాల రద్దుతో రైల్వే శాఖ కీలక నిర్ణయం




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): ఇండిగో విమాన సర్వీసులు సుమారు వెయ్యికి పైగా రద్దు అవ్వడంతో దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే భారతీయ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. దేశంలోని 37 ప్రీమియం రైళ్లలో 116 అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసింది. ముఖ్యమైన 10 రూట్లలో శనివారం నుంచి డిసెంబర్ 10 వరకు 37 ప్రీమియం రైళ్లకు మొత్తం 116 అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లుగా రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. ఇందులో థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ, స్లీపర్, చైర్ కార్ కోచ్‌లు కూడా ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 18 రైళ్లలో చైర్ కార్, స్లీపర్ కోచ్‌లను పెంచారు. ఇక తూర్పు రైల్వేస్ పరిధిలోని 3 కీలక రైళ్లలో స్లీపర్ క్లాస్ కోచ్‌ల సంఖ్యను పెంచారు. ఉత్తర రైల్వే జోన్ పరిధిలోని 8 రైళ్లలో థర్డ్ ఏసీ, చైర్ కార్ కోచ్‌లు పశ్చిమ రైల్వేస్ పరిధిలోని ఢిల్లీ-ముంబై వంటి రూట్లలో థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లు ఈస్ట్ సెంట్రల్ రైల్వేస్ పరిధిలోని సెకండ్ ఏసీ కోచ్‌లను అదనంగా అటాచ్ చేశారు. అదేవిధంగా అంతేకాకుండా, అత్యధిక డిమాండ్ ఉన్న మార్గాల్లో నాలుగు ప్రత్యేక రైళ్లను కూడా నడపనున్నట్లుగా రైల్వే అధికారులు తెలిపారు. ఇండియన్ రైల్వేస్ తాజా నిర్ణయంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పాట్నా, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల మధ్య ప్రయణించే వారికి కాస్త ఉపశమనం లభించనుంది. ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఈ అదనపు కోచ్‌లలో సీట్లు బుక్ చేసుకోవచ్చిన రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

## రెండు రాష్ట్రాల్లో “పవన్ కల్యాణ్ కామెంట్ల” రాజకీయ రచ్చ

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 06 (తీన్మార్ న్యూస్): తెలంగాణ నేతల దిష్టి తగిలి ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ కొబ్బరితోటలు ఎండిపోతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలుపై తెలంగాణ నేతలతో పాటు అటు వైసీపీ నేతలు కూడా స్పందించారు. పవన్ కల్యాణ్ టార్గెట్‌గా రెచ్చిపోయాయి. ఒకానొక దశలో తెలంగాణలో పవన్ కల్యాణ్ సినిమాలు ఆడనివ్వం అని కూడా ప్రకటనలు చేశారు. దీనిపై తెలంగాణ జనసేన నేతలు కూడా స్పందించి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాజాగా ఎక్స్‌లో ట్రెండింగ్‌లో TelanganaLovesPawankalyan అనే హాష్‌ట్యాగ్‌ను చేస్తున్నారు. ఈ హ్యాష్ ట్యాగ్‌తో తెలంగాణ ప్రజల కోసం పవన్ కల్యాణ్ చేసిన పనులను, పోరాటాలను, సాయాలను గుర్తుచేస్తున్నారు.

జనసేనకు స్ఫూర్తి నింపింది తెలంగాణ.
జనసేన పార్టీ పునాది తెలంగాణ.
జనసేనానికి పునర్జన్మ ఇచ్చింది తెలంగాణ.
ఛలోరే ఛలోరే చల్ అంటూ రాజకీయ పోరాటాన్ని నడిపించింది తెలంగాణ.
తెలంగాణ ప్రజల పక్షాన నిజమైన గొంతుక జనసేన అని క్యాప్షన్‌గా పేర్కొన్నారు.

# ఆంధ్ర కింగ్ తాలుకా కలెక్షన్స్ జోరు




బాక్స్ ఆఫీస్ దగ్గర లాస్ట్ వీక్ లో మంచి అంచనాల నడుమ రిలీజ్ అయిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన ఆంధ్ర కింగ్ తాలుకా సినిమా మంచి పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా అన్ని చోట్లా జోరు చూపెడుతుంది అనుకున్నా%శొ% కూడా ఓవరాల్ గా ఆ రేంజ్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఇంపాక్ట్ ని ఏమి చూపించలేక పోతున్న సినిమా మొదటి వీక్ ని ఎలాగోలా కంప్లీట్ చేసుకోగా రెండో వీక్ లో అడుగు పెట్టిన సినిమా మరింతగా డ్రాప్స్ ను అయితే కొనసాగిస్తూ ఉందని చెప్పాలి ఇప్పుడు.ఓవరాల్ గా 8వ రోజున 6 వేలకు పైగా టికెట్ సేల్స్ ను మాత్రమే సొంతం చేసుకున్న సినిమా తెలుగు రాష్ట్రాలలో 25 లక్షల రేంజ్ లో షేర్ ని సొంతం చేసుకోగా వరల్డ్ వైడ్ గా 30 లక్షలకు పైగా షేర్ ని 60 లక్షలకు పైగా గ్రాస్ మార్క్ ని సొంతం చేసుకోగా%శొ% మొత్తం మీద సినిమా 28 కోట్ల రేంజ్ లో వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగగా ఇప్పటి వరకు సాధించిన కలెక్షన్స్ కాకుండా ఇంకా 13.54 కోట్ల రేంజ్ లో షేర్ ని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక ఈ వీకెండ్ లో సినిమా ఎలాంటి కలెక్షన్స్ ని అందుకుంటుందో చూడాలి.

## ధనుష్ 100 కోట్ల మార్క్



బాక్స్ ఆఫీస్ దగ్గర హిందీలో చాలా టైం తర్వాత మంచి బజ్ తో వచ్చిన కోలివుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన హిందీ సినిమా తేరే ఇష్క్ మే సినిమా డీసెంట్ రివ్యూలను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా మంచి జోరుని చూపెడుతూ ఉండగా సినిమా ఓవరాల్ గా వర్కింగ్ డేస్ లో కూడా మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండగా 5 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 69.35 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకోగా 6వ రోజున వర్కింగ్ డే లో మరోసారి ఎక్స్ లెంట్ గా హెూల్డ్ ని చూపించిన సినిమా...6.89 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకుంది. ఇక టోటల్ గా 6 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 76.24 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా డబ్ వర్షన్స్ తో కలిపి సినిమా 79.75 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా%శొ%ఇండియాలో గ్రాస్ 93 కోట్ల రేంజ్ లో సొంతం చేసుకుంది. ఇక సినిమా ఓవర్సీస్ లో 1 మిలియన్ రేంజ్ లో వసూళ్ళని అందుకోగా ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఇప్పుడు 6 రోజుల్లో సాధించిన కలెక్షన్స్ తో 100 కోట్ల మార్క్ ని దాటేసి మాస్ రచ్చ చేయడం విశేషం.ధనుష్ కెరీర్ లో హిందీ లో ఇవి సెన్సేషనల్ కలెక్షన్స్ అని చెప్పాలి. ఓవరాల్ గా ఎక్స్ లెంట్ కలెక్షన్స్ తో కుమ్మేస్తున్న సినిమా హిందీ లో లాంగ్ రన్ లో 100 కోట్ల నెట్ కలెక్షన్స్ మార్క్ వైపు పరుగులు పెడుతూ ఉండటం విశేషం అని చెప్పాలి.ఇక సినిమా 7వ రోజున మరోసారి మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండటంతో మరోసారి 6 కోట్ల రేంజ్ కి అటూ ఇటూగా నెట్ కలెక్షన్స్ ని అందుకునే అవకాశం ఉండగా లాంగ్ రన్ లో సినిమా ఏ రేంజ్ లో మాస్ రచ్చ చేస్తుందో చూడాలి ఇప్పుడు.



## గ్లామర్ తో కట్టిపడేస్తున్న మానుషి చిల్లర్!

మానుషి చిల్లర్..ఈ పేరు చెబితే తెలుగు ప్రేక్షకులకు ఎక్కువగా తెలియకపోయినప్పటికీ వరుణ్ తేజ్ నటించిన ఆపరేషన్ వాలెంటైన్ మూవీ హీరోయిన్ అంటే అందరికీ ఇట్టే గుర్తుకొస్తుంది. మానుషి చిల్లర్ తెలుగులో చేసింది ఒక్క సినిమానే అయినప్పటికీ తన అందాలతో ఎంతోమందిని ఆకట్టుకుంది. అయితే అలాంటి ఈ బ్యూటీ తాజాగా ఓ అవార్డ్స్ ఫంక్షన్ లో మెరిసింది. తాజాగా బాలీవుడ్ హంగామా అవార్డ్స్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. ఈ అవార్డ్స్ ఈవెంట్ కి ఎంతోమంది తారలు పాల్గొని ఈవెంట్ ని సక్సెస్ చేశారు.

ఎంతోమంది సెలెబ్రిటీలకు బాలీవుడ్ హంగామా అవార్డ్స్ వరించాయి. అలా ఈ అవార్డ్స్ ఈవెంట్ లో మానుషి చిల్లర్ తన అందంతో అందరిని కట్టిపడేసింది.. మానుషి చిల్లర్ బాలీవుడ్ హంగామా అవార్డ్స్ ఈవెంట్ లో చాలా స్టైలిష్ గా కనిపించడంతోపాటు తాను వేసుకునే డ్రెస్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. మానుషి చిల్లర్ వేసుకున్న డ్రెస్ తో ఆమె అందం మరింత పెరిగింది. ముత్యాలు,చంకీలు, రత్నాలు పొదిగిన డ్రెస్ లా ఉండే ఈ డ్రెస్ లో మానుషి చిల్లర్ తళుక్కున మెరుస్తోంది. ముఖ్యంగా ఇప్పటి వరకు ఇలాంటి డ్రెస్ లో ఏ సెలబ్రిటీ కనిపించకపోయేసరికి అవార్డ్స్ ఈవెంట్ కి హాజరైన అందరి చూపు మానుషి చిల్లర్ డ్రెస్ మీదే పడింది. దీంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ అవార్డ్స్ ఫంక్షన్లో వైరల్ గా మారింది.

# థియేటర్లకు తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం చేశాం



టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన అంశం అఖండ 2 విడుదల వాయిదా. మరికొన్ని గంటల్లో సినిమా థియేటర్లలోకి విడుదల కాబోతుండగా వాయిదా పడటం అందరికీ షాక్ ఇచ్చింది. నందమూరి అభిమానులు దీనిపై తీవ్రమైన అసంతృప్తిని సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తున్నారు. 'ఇంత పెద్ద ప్రాజెక్ట్.. ఇంత పెద్ద స్టార్ హీరో సినిమా.. ఎలాంటి ప్లానింగ్ లేకుండా ఇలాంటి తప్పులు ఎలా జరుగుతాయి?'అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖండ 2 నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ కీలక ప్రకటన చేసింది. బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'అఖండ తాండవం' కోసం తెలుగు ప్రేక్షకులతో పాటు నార్త్ ఇండియా ఆడియన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంయుక్త మీనన్ హీరోయిన్‌గా, ఆది పినిశెట్టి విలన్‌గా నటించిన ఈ సినిమా డిసెంబర్ 4న ప్రీమియర్ షోలతో ప్రారంభమై, డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సింది. అయితే విడుదలకు కొన్ని గంటల ముందు అనుకోని పరిణామాలు చోటుచేసుకోవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అభిమానుల అంచనాలు, థియేటర్లలో ఏర్పాట్లు, బుకింగ్స్ అన్ని సిద్ధంగా ఉన్నా చివరి నిమిషంలో రిలీజ్‌పై సందిగ్ధత నెలకొనడంతో అందరూ నిరాశ చెందారు. అఖండ 2 తాండవం నిర్మించిన 14 రీల్స్ ప్లస్ సంస్థకు, హీరోస్ ఇంటర్నేషనల్ అనే సంస్థకు మధ్య ఉన్న పాత ఆర్థిక ఒప్పందాలు ప్రధాన వివాదంగా మారాయి. ఈ ఫైనాన్షియల్ అగ్రిమెంట్లపై తొలుత అంతర్గత చర్చలు జరిగినా, వివాదం పరిష్కారం కాకపోవడంతో హీరోస్ ఇంటర్నేషనల్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో కోర్టు సినిమా విడుదలపై స్టే విధించగా, ఇప్పటికే సిద్ధమైన దేశవ్యాప్తంగా ఉన్న షోలు, ఓవర్సీస్ స్క్రీనింగ్స్ అన్నీ నిలిచిపోయాయి. ఇండస్ట్రీ పరంగా, ప్రేక్షకులపరంగా ఇది చాలా అరుదుగా జరిగే పరిస్థితి. ముఖ్యంగా బాలకృష్ణలాంటి అగ్ర హీరో సినిమా పూర్తి స్థాయిలో ఆగిపోవడం ఇండస్ట్రీలో పెద్ద చర్చగా మారింది. అఖండ 2 విడుదలపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. 'అఖండ 2ని థియేటర్లకు తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం చేశాం. కానీ కొన్నిసార్లు ఊహించని పరిస్థితులు ఎదురవుతాయి. అందువల్ల సినిమా ఈరోజు విడుదల చేయడం సాధ్యం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఈ పరిస్థితుల్లో కూడా మాకు తోడుగా నిలిచిన బాలకృష్ణ గారికి, దర్శకుడు బోయపాటి శ్రీనుకు కృతజ్ఞతలు. అఖండ 2 ఎప్పుడెప్పుడు వచ్చినా బ్లాక్‌బస్టర్ అవడం ఖాయం. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం" అని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అఖండ 2 మేకర్స్ సోషల్ మీడియాలో ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన రావడంతో అభిమానుల్లో మరోసారి కన్ఫ్యూజన్ మొదలైంది. ఈ పరిణామాలతో బాలయ్య అభిమానుల్లో తీవ్ర అసహనం నెలకొంది. సినిమా విడుదల వాయిదా పడటంతో వారికి తీవ్ర నిరాశను కలిగించింది. సోషల్ మీడియాలో నిర్మాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి కొత్త రిలీజ్ డేట్‌పై ఉంది. అఖండ 2 ఇప్పటికే ఎన్నోసారి వాయిదా పడటంతో అభిమానుల్లో నిరాశ నెలకొంది. అఖండ 2 సినిమా ఎప్పుడు విడుదల అవుతుంది? చాలా మంది భావిస్తున్నట్లుగా ఈ సినిమా సంక్రాంతి రేసులోకి తీసుకువస్తారా? లేక మరింత ఆలస్యం చేస్తారా? అన్నది త్వరలోనే తెలుస్తుంది.



## సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత.. !!

ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడించింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇంస్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది. మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ - గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463